క్లుప్తంగా

నియామకం



చంద్రయ్య

రామగుండం: అంతర్గాం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాంపెల్లి చంద్రయ్యను జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

రాజ్యపురస్కార్‌కు ఎంపిక

గోదావరిఖనిటౌన్: అడ్డగుంటపల్లి శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు స్కౌట్స్ రాజ్యపురస్కార్ గవర్నర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 5 నుంచి పదో తేదీ వరకు హైదరాబాద్ జీడిమెట్లలో నిర్వహించిన స్కౌట్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో 14మంది విద్యార్థులు పాల్గొని ఉత్తీర్ణత పొంది సర్టిఫికెట్లు సాధించారు. అలాగే రాజ్యపురస్కార్ గవర్నర్ అవార్డు టెస్టింగ్ క్యాంపులో మణికంఠ, సుచరణ్, మణిదీప్, భగత్ తేజ, మహీధర్, వెంకట్రాంరెడ్డి రాజ్యపురస్కార్ అవార్డుకు ఎంపికయ్యారు. కరస్పాండెంట్ ఎస్.వెంకటేశ్వరరావు, స్కౌట్ జిల్లా సెక్రటరీ సూర్యదేవర జ్యోతి, వెంకటలక్ష్మి, విజయ తదితరులు విద్యార్థులను అభినందించారు.

అర్హులందరికీ ఓటుహక్కు

పెద్దపల్లిరూరల్: 2024 జనవరి1 నాటికి 18ఏళ్ల వయసు పూర్తయిన వారందరికీ ఓటుహక్కు కల్పిస్తూ జాబితాలో పేరు నమోదు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సూచించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు. ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేసి జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని, 22న అభ్యంతరాలు స్వీకరించేలా ఏర్పాట్లు చేయాలని వికాస్‌రాజ్ ఆదేశించారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా రూపొందించాలని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఈ ఓటరు జాబితా కీలకంగా ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1450 ఓట్లకన్న ఎక్కువ లేకుండా చూడాలని చెప్పారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ ఏరియాలో ప్రధాన డ్రైనేజీ పనులను కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ ప్రారంభించారు. కార్పొరేషన్ నిధులు రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. అయితే, దశాబ్దం తర్వాత సమస్యకు పరిష్కార మార్గం లభించడంతో డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికు ఎస్‌కే బాబుమియా, ఎస్‌కే ఇంతియాజ్, కె.మల్లేశ్, రాకేశ్, మల్లేశ్, సర్వర్, రాజు, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భవనం నిర్మించాలి



వినతిపత్రం అందిస్తున్న జగన్‌మోహన్‌రావు

ముత్తారం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కొత్త భవనం నిర్మించాలని ఎంపీపీ నాగినేని జగన్‌మోహన్‌రావు కోరారు. ఈమేరకు పెద్దపల్లిలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. అనంతరం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావుని కలిసి శుభకాంక్షలు తెలియచేశారు.

ఊసేలేని డిగ్రీ కళాశాల



1996లో ఆవిష్కరించిన శిలాఫలకం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు సుమారు 27ఏళ్ల క్రితం శిలాఫలకం ఏర్పాటు చేశారు. అప్పటి కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి, కేంద్ర కార్మిక శాఖ మంత్రి 3 మార్చి1996లో ఆ శిలాఫలకం ఆవిష్కరించారు. శిలాఫలకం అలాగే ఉంది. కానీ, డిగ్రీ కళాశాల ఏర్పాటు కాలేదు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జ్యోతినగర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సేవా భావం.. ఆధ్యాత్మిక ఉద్యమం

- అయ్యప్ప స్వాములకు భిక్షయజ్ఞం
- ఏటా 41 రోజులపాటు అన్నదానం
- అన్నపూర్ణకాలనీ స్నేహితుల సేవా గుణం



ఆలయంలో భిక్ష చేస్తున్న అయ్యప్ప మాలధారులు

జ్యోతినగర్: అయ్యప్ప మాలధారణ ఎంతో నిష్ఠ, నియమాలతో చేసే దీక్ష. పీఠం పెట్టడానికి మడి కట్టుకుని భిక్ష తయారు చేయడానికి చాలామంది ఇళ్లలో వీలుపడదు. అలాగే మాలధారణ చేసిన భక్తులు నిత్యం వివిధ పనులపై ఈ ప్రాంతానికి వస్తుంటారు. ఇలా వచ్చిన వారికి మధ్యాహ్నం భిక్ష ఎలా? అనేద సమస్యగా మారింది. దీనిపై ఆలోచన చేసిన స్థానిక అన్నపూర్ణకాలనీ అయ్యప్పస్వామి భక్తులు.. మాలధారణ చేసిన భక్తులు భిక్షకు ఇబ్బందులు పడకూడదనే నిర్ణయానికి వచ్చారు. ఎన్టీపీసీ భీమునిపట్నం అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప సేవా సమితి స్థాపించారు. డిసెంబర్ ఒకటో తేదీన భిక్ష ప్రారంభించారు. 41 రోజుల పాటు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు.

దాదాపు పది వేల మందికి..

- రోజూ సుమారు 200 మందికిపైగా 41రోజుల పాటు అంటే దాదాపు పదివేల మందికి అన్నదానం చేస్తున్నారు.
- అయ్యప్ప భక్తులు తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఎంతో శ్రమతో, దీక్షతో, అయ్యప్ప సేవగా భావించి మాలధారణ భక్తుల కడుపునిండా వేడివేడి, శుచి శుభ్రతతో కూడిన భిక్ష పెడుతున్నారు. 2012 డిసెంబర్‌లో అయ్యప్ప సేవా సమితి స్థాపించి నేటి వరకు నిర్విరామంగా అన్నదానం చేస్తున్నారు.

ఆహార పదార్థాలు ఇవే..

ఒక పండు, మిఠాయి, స్పెషల్ రైస్, కర్రీ, వైట్‌రైస్, సాంబార్, మజ్జిగతో భిక్ష అయ్యప్ప భక్తులకు పెడుతున్నారు. 41 రోజులకు అవసరమైన బియ్యం, పప్పులు, నూనెలు, వంట చెరుకు సమకూర్చుకున్నారు. వంటపాత్రలు, ప్లేట్లు, ఇతర వస్తువులు ప్రత్యేకంగా ఉంచుతున్నారు.

అంతా ఒకే కుటుంబంలా..

- అయ్యప్ప సేవా సమితి సభ్యుల్లో వ్యాపారులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, స్వయం ఉపాధి పనులు చేసేవారు ఉన్నారు.
- వీరంతా ఒకే కుటుంబంలా కలిసి ఉంటున్నారు.
- కష్టసుఖాల్లో కలిసి మెలసి సాయం చేసుకుంటున్నారు.
- ఏటా 41 రోజులపాటు అయ్యప్ప భక్తులకు భిక్ష పెట్టేందుకు అవసరమైన నిధులు వారే తలాకొంత పోగుచేసుకుంటున్నారు.
- కొందరు స్వచ్ఛందంగా నగదు, బియ్యం, పప్పులు, కూరగాయలు ఇస్తున్నారు.

2012 నుంచి అందిస్తున్నం



ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని అయ్యప్ప దేవాలయంలో 2012 నుంచి ఏటా భిక్ష పెడుతున్నం. రోజుజూ 200 వరకు మాలధారులతోపాటు భక్తులు భిక్ష చేస్తారు. అందరి సహకారంతో 41 రోజులు భిక్ష ఏర్పాటు చేశాం. భగవంతుని సహకారంతో అన్నదానం కొనసాగుతుంది.

-రాజేశ్వర్, గురుస్వామి

భిక్ష చేయడం అదృష్టం



అయ్యప్ప ఆలయంలో భిక్ష చేయడం మా అదష్టం. ఆలయంలో అందరం కలిసి పూజలు చేస్తాం. మాలధారణ స్వాములకు ఆలయ కమిటీ సభ్యులతో భిక్ష ఏర్పాటు చేస్తున్నం.

- చందర్, భీమునిపట్నం, ఎన్టీపీసీ

అందరి సహకారంతో..



అందరి సహకారంతో అయ్యప్పస్వాములకు 41 రోజుల పాటు భిక్ష అందిస్తున్నం. దాతలు ముందుకు వస్తున్నారు. సకాలంలో భిక్ష తయారు చేయడంలో అయ్యప్ప స్వాములు భాగస్వాములవుతున్నరు.

-తిరుపతి, ఎన్టీపీసీ

అయ్యప్ప ఆశీస్సులు



అయ్యప్ప స్వామి ఆశీస్సులతో భిక్ష సంకల్పం నిర్ణయించాం. అందరి సహకారం బాగుంది. 2012 నుంచి ఏటా 41 రోజుల పాటు భిక్ష అందిస్తున్నం. అయ్యప్ప సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆశిస్తున్నం.

- గాదంశెట్టి రాజు

బీజేపీకి పట్టం కట్టండి



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: నీతివంతమైన పాలన అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రజలు మరోసారి పట్టంకట్టాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి పోటీ చేసే అవకాశాన్ని దళిత మోర్చా నాయకులకే ఇవ్వాలని కోరారు. మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, నాయకులు కరుణాకర్, నర్సింగరావు, వెంకటేశ్, లక్ష్మణ్, దేవరాజు పాల్గొన్నారు.

బీఎంఎస్‌తోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సత్తయ్య

రామగిరి: సింగరేణి కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారం బీఎంఎస్‌తోనే సాధ్యమని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సోమవారం ఆర్జీ–3 పరిధిలోని ఏఎల్‌పీ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కాగడా గుర్తుకు ఓటు వేసి బీఎంఎస్‌ను గెలిపించాలని కోరారు. అరుకాల ప్రసాద్‌గౌడ్, మామిడి స్వామి, కృష్ణయాదవ్, వల్లెపు సురేశ్, మహేశ్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: తమ యూనియన్‌ను గెలిపిస్తే సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. శనివారం ఓసీపీ–3 బేస్‌వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం కింద 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.20 లక్షల వడ్డీ లేనిరుణం ఇప్పిస్తామన్నారు. పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ యాజమాన్యంతో చెల్లింపజేస్తామని చెప్పారు. నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, ప్రసాద్, వంగ లక్ష్మీపతిగౌడ్, అక్బర్‌అలీ, అక్రం, శంకర్‌నాయక్, వికాస్‌కుమార్‌యాదవ్, వడ్డేపల్లి దాస్, దశరథం, ఆకుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వంతెన పరిశీలన



వంతెన పరిశీలిస్తున్న డీఈ మధుమతి

సుల్తానాబాద్: పట్టణంలోని ఎస్సారెస్పీపై నిర్మించిన వంతెనను డీఈ మధుమతి సోమవారం పరిశీలించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలతో వంతెన ధ్వంసమవుతోందని స్థానికుల నాయకుల ఫిర్యాదు మేరకు ఆమె వంతెనను పరిశీలించారు. ఎంపీటీసీ శీలం శంకర్, నాయకులు గుర్రం శ్రీనివాస్‌గౌడ్, రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

జూలపల్లి: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం ఎమ్మెల్యే విజయరమణారావును పెద్దపల్లిలో కలిశారు. నాయకులు ఆమరగాని సాయిగౌడ్, కూసి మహేశ్, బెజ్జెంకి రవి, మహేందర్, డేవిడ్‌రాజు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెద్దపల్లిరూరల్: ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండి సతీశ్ ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. హైదరాబాద్‌లో మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు కండువా కప్పి సతీశ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామగిరి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ తెలిపారు. నాగెపల్లి వద్ద ట్రాక్టర్లను పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

వైభవంగా మహాపడిపూజ

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సోమవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ మహోత్సవం గురుస్వామి కావేటి పరమేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణానికి చెందిన మాటేటి శ్రీనివాస్ గురుస్వామి 18వ సారి మాలాధారణ చేసి శబరిమలై యాత్ర చేపట్టిన సందర్భంగా మెట్లపూజ నిర్వహించారు.

లంబాడితండాను అభివృద్ధి చేస్తా

ఓదెల: లంబాడితండాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం లంబాడితండా ఉపసర్పంచ్ నిమ్మనాయక్ రాజమ్మ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, తండావాసులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

బెంచీలు వితరణ

ధర్మారం: కమ్మరిఖాన్‌పేట ప్రభుత్వ పాఠశాలకు విశాఖ చారిటేబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం 50 బెంచీలు పంపిణీ చేశారు. ట్రస్టు కో ఆర్డినేటర్ కాడే సూర్యనారాయణ, సర్పంచ్ గుజ్జుల రమాదేవి, బీజేపీ మండల అధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు కుందేళ్ల కిరణ్‌కుమార్, ఎస్.బాలునాయక్, గందం మహిపాల్, పోనవేని స్వామి, బొంగాని సత్యనారాయణ, కంసాని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్జీఎఫ్ పోటీలు

సుల్తానాబాద్‌రూరల్: రేగడిమద్దికుంట జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి దాసరి రమేశ్ తెలిపారు. అండర్ –14 బాలబాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని, క్రీడాకారులు ఉదయం 9.30గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

15లోగా దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: జర్మనీలో నర్సింగ్ సిబ్బందిగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. టాంకాం ద్వారా శిక్షణతోపాటు నియామకం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. జర్మనీలో 3 ఏళ్ల ఇంటర్నేషనల్ డిగ్రీ తర్వాత మంచి వేతనంతో ఉద్యోగ హామీ లభిస్తుందన్నారు. వివరాలకు 63022 92450, 79012 90580లో సంప్రదించాలన్నారు.

ఆశ్రమానికి ప్రింటర్ అందజేత

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రింటర్ అందించారు. క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి, సెక్రటరీ బంక కళావతి, కోశాధికారి మనిషాఅగర్వాల్, సత్తయ్య, వెంకయ్య, సీతారాంరెడ్డి, వెంకటరమణారెడ్డి, రాజేంద్రప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

అప్పన్నపేటలో హోమయజ్ఞం

పెద్దపల్లిరూరల్: అప్పన్నపేటలో పునర్నిర్మాణం చేసిన భక్తాంజనేయస్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠాపనోత్సవాలు సాగుతున్నాయి. మందల భాస్కర్‌రెడ్డి, చీకటి పోచాలు, స్వరూప, మందల సత్యనారాయణరెడ్డి, రమాదేవి, సునీత, రాజేందర్, రాజిరెడ్డి, విమల పాల్గొన్నారు.

బాధితులకు రెస్క్యూ సేవలు

యైటింక్లయిన్‌కాలనీ: పోతనకాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ మహిళ తల, కాలుకు గాయాలయ్యాయి. పోటీలకు వెళ్తున్న రెస్క్యూ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్తీక పూజలు

సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని వేడుకున్నారు.

రాఘవాపూర్‌లో రైతు మృతి

పెద్దపల్లిరూరల్: రాఘవాపూర్ వద్ద కారు, మోపెడ్ ఢీకొన్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న జంగిలి కొమురయ్య (60) అనే రైతు సోమవారం మరణించాడని బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ తెలిపారు. కమాన్‌పూర్ మండలం పేరపల్లికి చెందిన కొమురయ్య తను పండించిన కూరగాయలను పెద్దపల్లి మార్కెట్‌లో అమ్ముకునేందుకు వస్తూ గాయపడ్డాడు. మృతుడి కుమారుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోస్ట్‌మన్ మృతి

ఫెర్టిలైజర్‌సిటీ: శాంతినగర్‌కు చెందిన ఎఫ్‌సీఐ పోస్ట్‌మన్ బాణాల బ్రహ్మాచారి(58) అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన మృతితో గౌతమినగర్, లక్ష్మీపురంలో విషాదం అలముకుంది.

పరామర్శ

ఓదెల: గూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పమల్ల చంద్రమౌళి కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. చంద్రమౌళి తల్లి రాధమ్మ ఇటీవల మృతిచెందారు. దాసరి వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఏఐటీయూసీతోనే మనుగడ

యైటింక్లయిన్‌కాలనీ: ఏఐటీయూసీతోనే సింగరేణి మనుగడ సాధ్యమని ఆ యూనిన్ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రెస్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీరావు, నాయకులు రాంచందర్, ప్రకాశ్, రాజారత్నం, మల్లేశ్, తిరుపతి, రాజేశ్, కిరణ్, ఎంఆర్‌సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను మాఫీ చేస్తాం

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో సీఐటీయూని గెలిపిస్తే కోలిండియా మాదిరిగా సింగరేణిలో పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ మాఫీ చేయిస్తామని ఆ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. సోమవారం జీడీకే–1,3గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. నాయకులు గిట్ల ముకుందరెడ్డి, మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, దాసరి సురేశ్, సాయికృష్ణ, సాగర్, శశి, మహేశ్, వేణుగోపాల్‌రెడ్డి, ఆరేపల్లి రాజమౌళి, వంగల శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్‌ను ఆదరించండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు అండగా ఉంటున్న హెచ్‌ఎంఎస్‌ను ఈ ఎన్నికల్లో ఆదరించాలని ఆర్జీ–3 వైస్ ప్రెసిడెంట్ మధునయ్య, కార్యదర్శి ఇస్మాయిల్ కోరారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా డిస్పెన్సరీ సిబ్బందితో మాట్లాడారు. నాయకులు లింగయ్య, బాపు, సదానందం, శంకర్ ఉన్నారు.

నేత్రదానం చేయండి



దోనర్ కార్డు చూపుతున్న ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ: నేత్రదానం మహాదానం అని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా గనుల వృత్తి శిక్షణ కేంద్రం(ఎంవీటీసీ)లో నేత్ర, శరీర అవయవదానాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రూ.కోట్లు వెచ్చించినా లభించని మానవ శరీరంలోని అవయవాలు మరణించిన తర్వాత మట్టిలో కలిసి పోకుండా సమాజ హితం కోసం దానం చేయాలని కోరారు. అవయవదానం కోసం ముందుకు వచ్చిన 30 మంది సింగరేణి ఉద్యోగులను ప్లాంట్ పీవో నూక రమేశ్, ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించి డోనర్ కార్డులు అందజేశారు. సూపర్‌వైజర్లు నాగెల్లి సాంబయ్య, సతీశ్, తిరుపతి పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీని గెలిపించాలి

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. సోమవారం తన నివాసంలో యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌తో కలిసి ఐఎన్‌టీయూసీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపులో సింగరేణి కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. వారికోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. కార్మికుల సొంత ఇంటి కల సహకారం కావాలన్నా, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు కావాలన్నా, రామగుండంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్నా సింగరేణి ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని కోరారు. నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, మహంకాళి స్వామి, ముస్తఫా, వికాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటిలో వర్క్‌షాప్



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: స్థానిక ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సహకారంతో మూడురోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభించారు. ఫ్రంట్ అండ్ డెవలప్‌మెంట్ ఆన్ హెచ్‌టీఎంఎల్–5 అండ్ సీఎస్‌ఎస్–3'పై మొదలైన వర్క్‌షాప్‌ను డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగనేశన్ ఆరంభించారు. టాస్క్ రిసోర్స్‌పర్సన్ సిరిచందన విద్యార్థులకు వివిధ అంశాలు వివరించారు. ఏవోసురేశ్, రాజిరెడ్డి, కో ఆర్డినేటర్స్ కౌసల్య, కృష్ణయ్య, స్వాతి, మధుశేఖర్, నటరాజన్, ఆరిఫ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతం పోరాటం చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడె యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. సోమవారం జీడీకే –2వ గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రీయిబర్స్‌మెంట్ కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్తు, బొగ్గు బ కాయిలు రూ.26వేల కోట్లు సింగరేణి పరిశ్రమకు చెందేలా కృషి చేస్తామన్నారు. నూతన బొగ్గు బ్లాకుల కోసం టెండర్లలో పాల్గొని సింగరేణిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసేలా చూస్తామన్నారు. సారంగపాణి, ఆకుల హరీశ్, సతీశ్, వెంకటస్వామి, రాజేశం, లక్ష్మయ్య, విజయ్‌కుమార్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్యానెల్ ఇన్‌స్పెక్షన్

రామగుండం: అంతర్గాం మండలం ఎల్లంపల్లి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో బోధన తీరుతెన్నులు తెలుసుకునేందుకు రామగుండం జెడ్పీ హైస్కూల్ సబ్జెక్టు ఉపాధ్యాయులు సోమవారం ప్యానల్ ఇన్‌స్పెక్షన్ చేపట్టారు. సిలబస్ ఆధారంగా విద్యాబోధన ఉందా, సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రతిభ, హాజరు, మౌలిక సదుపాయాల కల్పన, ఉన్నతి, లక్ష్య తదితర పద్ధతుల అమలుపై ఆరా తీశారు. టీచింగ్, లర్నింగ్ మెథడ్ (టీఎల్‌ఎం) విధానంలో విద్యాబోధన ఉందా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రామగుండం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర శారద, అంతర్గాం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ తొటం కల్పన తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు విశ్వసించొద్దు



మాట్లాడుతున్న ఎస్సై సంతోష్‌కుమార్

రామగుండం: గ్రామాల్లో మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలతో ప్రజలు నష్టపోతున్నారని, కుటుంబాల మధ్య తగాదాలు ఏర్పడుతున్నాయని అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి అంతర్గాం మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో సాంఘిక దురాచారాలు, సైబర్ నేరాల నియంత్రణ, షీ టీమ్స్ సేవలు, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలను అడ్డుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. డయల్ 100, హత్యలు, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు తదితర సమస్యలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయని తెలిపారు.